# చీకటి

"నీకీ సంగతి తెలీదు కదూ?—అందుకే చెబుతున్నాను. జాగ్రత్తగా విను భగవంతుడు తినవద్దన్న చెట్టు పండును ఆడదాని మాయలో పడి ఓ మగవాడు తినడంతో, ఆ భగవంతుడికి కోపం వచ్చి, వాళ్ళను ఘోరంగా శపించాడు."

«ఏమని?» పరధ్యానంగా వున్నవాడల్లా నావేపు తిరిగి అడిగాడు శివశాస్త్రి. నా చేతిలో సిగరెట్టు కాల్తోంది. సిగరెట్టు లాంటి అతని జివితం కాలిపోతున్నది నిక్షేపం లాంటి జీవితం పాడై పోతున్న బాధ అతని కళ్ళలో స్పష్టంగా కన్పిస్తోంది.

"ఏమనా?" 'పగటి వెలుగు తగ్గిపోయి, రాత్రి చీకట్లో నువు తారట్లాడతావ్' అని శపించాడు భగవంతుడు. 'చీకటి వంటి చావు నిన్ను కృంగదీస్తుంది' అన్నాడు మళ్లీ."

"పూర్ సోల్స్!" శివశాస్త్రి నిట్టూర్చాడు.

“ఇంకా వుంది విను, ఆ స్త్రీ పురుషుల కిరువురికీ భగవంతుని శాపం భరింపరానిదైంది. చీకటి ఎట్లావుంటుందో అంతవరకూ వాళ్ళిద్దరూ చూడక పోయిరి! అయినప్పుడు ఇహ చావంటే వాళ్ళకేం తెలుసు? పోనీ ఎట్లా వుంటుందో తెలుసుకుందామన్నా, శాపం ఇచ్చిన దేముడూ, శాపం ఇప్పించిన సైతానూ ఇద్దరూ కనిపించకుండా పోయారు. దిగాలు పడి, వన్నె దరిగి, ఆ దంపతులు ఒక చెట్టు నీడన ఒకరి కౌగిలింతలో మరొకరు కొంతసేపు వూరట పొందారు. దుఃఖించి కళ్ళు మూసుకున్నారు. కళ్ళు మూసుకున్న వాళ్ళ కిద్దరికీ తమ చుట్టూ ఏదో మాయ క్రమ్ముతున్నట్లయింది. అరమూతలుగా రెప్పలు విచ్చి చూస్తే, అప్పటికప్పటికే సూరీడు పడమటి కొండ ప్రక్కన వున్న కాలపుటఘాతంలోకి చూచుకొనక పడిపోతున్నాడు వాళ్ళకు కాలమే తలక్రిందైనట్లనిపించింది. వారి చుట్టూ నీడలను పర్చిన ఎండ క్రమక్రమేపి తనే ఒక పెద్ద నీడగా కరిగిపోయింది. నల్లని నీడ, పాపం లాటి నీడ, భయం కల్గించే నీడ, చీకటి నీడ వాళ్ళ దేహాలనూ ఆత్మలనూ కబళించింది. కళ్ళు తెరిస్తే చీకటి; కళ్ళు మూస్తే చీకటి అంతరంగంలో చీకటి, ఆకాశం నిండా చీకటి ఎట్లా చిక్కని వానలాంటి ఆ చీకట్లో బ్రతకడం? వాళ్ళు మరింతగా ఒకరినొకరు కౌగిలించుకున్నారు. ఒకరి కన్నీటి నొకరు తుడుచుకున్నారు. ఇంతలో ఆకాశం మీద పువ్వులు చల్లినట్లు, నిరాశ నెలార్చిన పెదవులమీద నవ్వులు పర్చుకున్నట్లు నక్షత్రాలు ఒక్కటొక్కటీ పొడిచాయి. నక్షత్రాలు పొడిచిన కొద్దిసేపటికి చంద్రు

డున్నా ఉదయించాడు. ఎక్కడి చీకటి అక్కడ కరిగి పోయింది. దేవతల వరం లాంటి వెన్నెల దివి నుండి భువికి నిశ్చెన కట్టింది.

"చీకటి తర్వాత ఇంతటి వెన్నెల వుందా!" అన్నాడా మగవాడు.

"చీకటి తర్వాత ఏముందో తెలీక ముందుగా చీకటిని చూసి భయపడ్డాం. చావు తర్వాత ఏముందో తెలీక చావును గురించి అనవసరంగా భయపడుతున్నాం. చీకటి, చావు కూడా ఎంతో అవసరమే, తర్వాత వచ్చే వెన్నలకూ, సుఖానికీ!" అన్నది ఆ చిన్నది.

'పేరబుల్' చెప్పడం ఆపి శివశాస్త్రి వేపు చూశాను. మేమిద్దరం కాలేజీ కాంటీనులో కాఫీ తాగుతున్నాం. దగ్గర్లో ఎవరూ విద్యార్థులు లేరు. లెక్చరర్లు కూడా, చాలామంది, ఆ రోజు పని పూర్తి చేసుకుని నాలుగింటికే ఇళ్ళకు వెళ్ళిపోయారు కాలేజీ నిద్రపోతున్నదా అనిపిస్తున్నది.

శివశాస్త్రి నా కథనం గురించి పట్టించుకొన్నట్లు లేదు. నూతిలో నుంచి మాట్లాడుతున్నట్లుగా అన్నాడు "మా నాన్న జబ్బు మరీ ఎక్కువౌతోందిరా!" తాగుతున్న కాఫీ బల్లమీద పెట్టి శాస్త్రి వేపు చూశాను వాడికి ఇంకా ముప్పై ఏళ్ళన్నా నిండలేదు. అప్పుడే ప్రక్కల జుట్టంతా నెరిసి పోయింది. ముడుతలుపడ్డ దవడలు కళ్ళు గుంటలు పడి లోపలకు పీక్కుపోయాయి.

"ఇదివరకోసారి చెప్పావ్. అదే జబ్బు మళ్లీ వచ్చిందా?" వాడు తల అడ్డంగా వూపాడు "ఇదో క్రొత్త రకం ఏదైతే ఏం—నా ప్రాణాలు కొరుక్కు అంటోంది."

శివశాస్త్రి-నేనూ చిన్నప్పటి నుంచి కలిసి మెలిసి చదువుకున్నాం. వాడేమీ పెద్దగా ఆస్తి పాస్తులు వున్న వాడు కాదు. వాళ్ళ నాన్న యాయవారం ఎత్తుకుని, ఆ మధ్యలో అడపా దడపా బ్రాహ్మణార్థాలకు భోక్తగా వెళ్ళి వాళ్ళో పావలా వీళ్ళో అర్థా ఇస్తే దాంతో కుటుంబాన్ని ఈడ్చేవాడు. శివశాస్త్రి ఒక్కడే ఆయనకు కొడుకు కావటం చేత, సాంప్రదాయపు చదువులు గిట్టుబాటు కావనుకొని, వాడికి ఇంగ్లీషు చదువు చెప్పిద్దామని ఆశ పడ్డాడు. నిజానికి శివశాస్త్రి నాకన్నా తెలివిగలవాడు. యస్. యస్. యల్. సి. లో స్కూలుకంతా ఫస్టున ప్యాసైనాడు

ఓ రోజున వాళ్ళ నాన్న దగ్గర నాకున్న చనువు తోటి, "ఏమండీ! శాస్త్రిని కూడా కాలేజీలో చేర్పించండి. నేనూ చేర్తున్నాను; ఇద్దరం కలిసి చదువుకుంటాం" అన్నాను. గ్రుడ్డిలో మెల్లగా క్రొత్తగా ఆ సంవత్సరమే మేమున్న ఊళ్ళో కాలేజీ పెట్టారు.

ఆయన ఏమనుకున్నాడో, ఏం బాధలు పడ్డాడో నాకైతే తెలీదుకాని, శాస్త్రిని మాత్రం కాలేజీలో చేర్పించాడు. సంవత్సరం నిండ కుండానే వాడికో పెళ్ళి సంబంధం ఖాయపర్చాడు. ఆ పెళ్ళి షరతులు కూడా చాలా తమాషాగా ఉన్నాయి. ఉభయ ఖర్చులూ వధువువేపు వాళ్ళే

పెట్టుకోనేట్లు; ఇంటర్మీడియేటు ప్యాసు కాగానే ఆనర్సుకు అల్లుణ్ని పంపే ఏర్పాటు ఆ మామగారే చేసేటట్లు వాడికి నిజానికి ఇంకా అప్పటికిపద్ధెనిమిదేళ్ళయినా నిండలేదు. ఎదురు తిరిగే వయసు, కోరికలను నిగ్రహించుకోలేని మనసు. పైకి తనకు పెళ్ళి అయిందని స్నేహితులకందరికీ ఎక్కడ తెలిసి పోతుందేమో అన్న లజ్జ; లోపల భార్యమీద విపరీతమైన కాంక్ష. ఇంతలో వాడి భార్య నీళ్ళు పోసుకుంది. అంత వరకూ శాస్త్రి ఇంతటి వ్యవహర్త అయ్యాడని వాడి తల్లి దండ్రులకి తెలీదు! శాస్త్రి అటు ఇంటర్మీయేటు ప్యాసు కావడమూ, ఇటు అతని భార్య కొడుకునెత్తుకుని అత్తవారింట అడుగుపెట్టడమూ ఒక్కసారే జరిగాయి.

అప్పటికి శాస్త్రి కొంచెం పొడుగెదిగాడు.

మొహంలోకి ఒక వింత కళ వచ్చింది.

ఆ తర్వాత నేను మద్రాసుకు వెళ్ళిపోయాను, బి. యస్. స్సీ చదవటానికి. మా కాలేజీలో ఇంకా సైన్సు కోర్సులు వోపెన్ చెయ్యలేదు. బి యస్. స్సీ రెండేళ్ళు చదివి, మద్రాసు వాతావరణానికి అలవాటు పడి, సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు కాలక్షేపం కాక కొంతా, స్నేహితుణ్ని చూద్దామని కొంతా మనసులో కోరిక పడి వాడి ఇంటికి వెళ్తే, శాస్త్రి ఇంట్లో లేడని, దేశాల మీదకు కోపంవచ్చి పోయాడని తెలిసింది.

వాళ్ళ నాన్న నాదగ్గరకు వచ్చి కళ్ళల్లో నీళ్ళతో “నేనేం ద్రోహం చేశాను నాయనా వాడికి? నాకు చేతనైనంతవరకూ రెక్కలిప్పించాను. ఏం చేయను? నేనే, ఆ

కొంపా ఆ కొంపా అడుక్కుని బ్రతుకుతున్నవాణ్ణి. వాళ్ళ మామగారు బి ఎస్. స్సీ చెప్పించలేదని, నామీద కోప్ప డితే నేనేం చేయను? పైగా మెడకు ఈ గుదిబండలు నాకు!” అంటూ శాస్త్రి పిల్లలను చూపించాడు.

మొదటిసారి మగపిల్లవాడయితే, రెండవసారి కవల పిల్లలు కలిగారట!

నేను విచారంగా బయటకు వచ్చేశాను.

శాస్త్రి——నేనూ కలిసిమెలిసి ఆడుకున్న రోజులన్నీ జ్ఞాపకానికి వస్తున్నాయ్. గంట కొట్టగానే వూరి మధ్యగా వున్న వేణుగోపాలస్వామి దేవాలయంలోకి పరుగెత్తుకు వెళ్ళే వాళ్లం, ప్రసాదాలకు పోటీ పడి. దూరంగా వున్న కృష్ణా కాల్వకు మేమిద్దరం తెల్లవారు జామున నే లేచి, ఇంట్లోవాళ్లు లేవక పోయినా, ఒకళ్ళకొకళ్ళం తోడు చేసుకుని, ఆ మెట్ల దగ్గర వంటరిగా చలిలో నిలబడి, భక్తిగీతాలను పాడు కుంటూ స్నానార్థం వచ్చే ఆడంగులకు స్వాగతం పలికే వాళ్లం.

ఏవీ ఆ రోజులు! కళ్లముందే కల్లలైనాయి. వాడి జీవితమూ పాడై పోతోంది.

నేను మళ్ళ మద్రాసుకు వచ్చేసరికి, నాగది ముందు, కళ్లల్లో ప్రాణాలు పెట్టుకుని వున్నాడు శివశాస్త్రి. ఆశ్చ ర్యంతో, ఉద్వేగంతో లోపలకు తీసుకు వెళ్ళి, క్షేమం విచారించా. వారం రోజుల్నించీ కటిక మంచినీళ్లు త్రాగి నాకోసం అల్లా ఎదురు చూస్తూ ఆ గడప దగ్గర పడి వున్నాడట!

"పోనీ ఉత్తరమన్నా రాయకూడదట్రా?" అన్నాను కొంత బాధతోటి, కొంత కోపం తోటీ. వాడు సమాధానం చెప్పలేదు.

"ఒరేయ్! మామామగారు నన్ను అవమానించార్రా! చదివిస్తానని మోసం చేశారు నేనేమైనా సరే చదువుకోవాలి డిగ్రీ హోల్డర్ని అనిపించుకోవాలి. ఇంట్లో వుంటే ఇల్లాలి పోరు ఎక్కువైంది, ఏదైనా ఉద్యోగం చూసుకోమని. చిన్నతనంలో ఎందుకు పెళ్ళి చేసుకోకూడదో ఇప్పుడు బాగా తెలిసి వస్తోంది. ముగ్గురు పిల్లలు. నా మెడకు ఉరి త్రాళ్ళు ఏమైనా సరే నేను డిగ్రీ తెచ్చుకోవాలి"

అతన్ని సముదాయించి, వాళ్ల మామగారికో టెలిగ్రాం ఇచ్చాను. సరిగ్గా ఆయన వచ్చిన సమయానికే వాణ్ని ఇంకో చోటికి పంపించేసి, "చూడండి, పెద్దవాళ్లు మీరు మీ రేదో చదువు చెప్పిస్తారని వాడెంతో ఆశతో ఉన్నాడు. వాణ్ని మీరట్లా నిరాశపర్చకూడదు. నలుగురి ముందూ ఆనాడు మీరిచ్చిన వాగ్దానం నెరవేర్చుకోండి"

"అల్లుడేడీ?" అన్నారాయన ఆలోచిస్తూ.

"మీరు ఒప్పుకునేదాకా మీ అల్లుడు కన్పించడు. ఒప్పుకోకపోతే అసలు కన్పించడు."

"అంటే?" అన్నాడాయన కళ్ళు చికిలించి.

"ఆత్మహత్య చేసుకోబోతుంటే ఆపాను."

ఆయన నవ్వాడు. నవ్వి అన్నాడు. "మా అల్లుడు అంత పిచ్చివాడనుకోలేదూ!— మొదట్లో పెళ్ళాం పిచ్చి— తర్వాత చదువు పిచ్చినూ."

మొత్తం మీద ఆయన్ను వప్పించి, శివశాస్త్రిని లరెబొరేటరీలో చేర్పించాను. నేను ఆనర్సు పూర్తిచేసే సరికల్లా వాడి బి. యస్. సీ. కూడా పూర్తయింది. అప్పటికి మావూళ్లో క్రొత్తగా పెట్టిన కమిటీ కాలేజీ కొంచెంగా కాలు నిలద్రొక్కుకుంటోంది. ఆ కాలేజీలోనే నేను లెక్చరర్ గానూ, శివశాస్త్రి డిమాన్‌స్ట్రేటరు గానూ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాం.

శివశాస్త్రికి అప్పట్నించీ మనసులో కల్లంగా వుండేది. తను 'పోస్ట్ గ్రాడ్యుయేట్' కాలేకపోయాననే అని. నేనే వాడి బాధ చూసి, ఒకటికి రెండుసార్లు అన్నాను.

"ఒరేయ్! ఎప్పుడూ అలా దిగులు పడ్డట్టుగా ఉండక పోతే, నువ్వు సంపాయించుకొంటున్న దాంట్లోనే కొంత మిగుల్చుకుని, ఎ భగల్పూర్ యూనివర్సిటీకో లిటరేచర్‌కు కట్టరాదూ? స్వార్జితం కన్నా ఉత్తమం ఏముందిరా!"

డబ్బు సంపాయించుకోవడం, మిగుల్చుకోవడం మాట ఎట్లా వున్నా, పూర్వజన్మ పుణ్య ఫలం అన్నట్లుగా, ఇంటికి నిండుగా, సందడిగా, మెడ దండడిగా, ఓ ఆరేడుగురు తయారయారు.

ఓరోజున నేను క్లాసులో 'హీట్' మీద పాఠం చెబుతుండగా, శివశాస్త్రి నా దగ్గిరికి హడావిడిగా వచ్చి, 'ఎక్స్‌క్యూజ్ మి, వన్ మినిట్' అంటూ నన్ను బయటకు పిల్చి "అర్జంటుగా ఇంటికి వెళ్లాలి బ్రదర్! కబురొచ్చింది. నువ్వు రావాలి నాతోటి. తెలుసుగా, నేనసలే కంగారు మనిషిని" అన్నాడు.

"ఏమిట్రా అసలు సంగతి?"

"అదే... మా నాన్నగారి వ్యవహారం."

శాస్త్రి అప్పటికి అంతకన్నా ఏమీ చెప్పలేదు. దారిలో అసలు సంగతి బయట పెట్టాడు. వాడి చెల్లెలు, పెళ్ళి కేపనగా, ఓ సంవత్సరం క్రితం పోయింది, ఏదో విష జ్వరం వచ్చి ఆ పిల్ల అంటే శివశాస్త్రి వాళ్ళ నాన్నకు పంచప్రాణాలునూ. శాస్త్రికి, ఆ అమ్మాయికీ ఎట్లాలేదన్నా వయసులో అయిదారేళ్ళ తేడా వుంది. అచ్చు బంగారు తీగలా వుండేది. శివశాస్త్రి వాళ్ళ నాన్నగారు అష్టకష్టాలు పడి సంబంధం తీసుకొచ్చారు. తీరా తీసుకొస్తే ఆ భగవంతుడు చిన్నచూపు చూశాడు ఆ ఇంట్లో ఆ రోజు చీకటి రాజ్యం చేసింది. ఆ చీకటి శివశాస్త్రి నాన్నగారి మనసును ఆక్రమించి, ఆయన మతి స్థిమితం లేకుండా చేసింది

మేం ఇంట్లోకి వెళ్ళేసరికి వాకిట్లో ఓ అయిదారుగురు కుర్చీల్లో కూర్చునున్నారు. వాళ్ళేమన్నా బంధువులేమోనని శాస్త్రి వైపు చూశాను. వాడూ తెలీదన్నట్టు మొహం పెట్టాడు.

ఇహ నేనే నియోగం చేయక తప్పలేదు. అప్పుడు తెలిసింది, వాళ్ళు పెళ్లి కుమారుడూ, అతని వేపు బంధువులూనని! శివశాస్త్రి నాన్న తనకో పెళ్ళి కావల్సిన అమ్మాయి వుందనీ, ఆ అమ్మాయిని చూట్టానికి రమ్మనమనీ వాళ్ళను ఆహ్వానించాట్ట!

సంవత్సరం క్రితం చనిపోయిన అమ్మాయి పెళ్లి సంబంధం!

శివశాస్త్రి వాళ్ళను చూసి ఎంతో సిగ్గుపడి పోయాడు.

"ఒక్కగానొక్క చెల్లెలండీ! నాకు అమ్మాయి! సరిగ్గా రేపు రాత్రి పెళ్ళి అనగా చనిపోయింది. అప్పటి నుంచీ మా నాన్నగారికి ఇట్లా మతిపోయింది. దయచేసి మమ్మల్ని క్షమించండి. మీకు చాలా కష్టం కల్గించాం."

వాళ్ళు కూడా మంచివాళ్లలాగ వున్నారు. అర్థం చేసుకుని, బాధపడి, వెళ్ళిపోయారు. అప్పటి నుంచి శివ శాస్త్రి నాన్నగారు అడపాదడపా ఇట్లాంటి ఉపద్రవాలు తీసుకువస్తూనే వుండేవారు. సమాధానం చెప్పుకోలేక శివ శాస్త్రికి తలప్రాణం తోకకు వచ్చేది. ఒకరోజురాత్రి వాళ్ళ నాన్నను ఎన్నడూ లేనిది, ఓ వెర్రి కోపంతో తిట్టాడట.

మర్నాడు నాతో కాలేజీలో చెప్పుకుని ఏడ్చాడు.

"నా కోసం గంపెడు చీకటిని నెత్తిన వేసుకుని అష్టకష్టాలు పడ్డ నాన్నకు నేనిచ్చిన బహుమతి ఇదిరా" అంటూ తల్చుకు తల్చుకు ఏడ్చాడు. ఎట్లా వాణ్ణి ఓదార్చడం?

ఇదిట్లా వుండగానే శివశాస్త్రి తల్లి కూడా చనిపోయింది. శివశాస్త్రి నాన్నగారికి మతిలేని సమయంలో ఆ సంఘటన జరిగింది. కొడుకు స్మశానానికి తీసుకువెళ్ళి తగల బెట్టటం కూడా ఆ తండ్రికి తెలీదు గాజు కళ్ళతో జరుగు తున్న తతంగాన్నంతా చూస్తూ నిలబడ్డాడు. ఒకరిద్దరు వచ్చి సానుభూతి వాక్యాలు చెప్పబోతే..."ప్చ! ప్చ! ఎంత ఘోరం జరిగి పోయిందో చూశారా? పెళ్ళి కావలసిన పిల్ల!

పెళ్ళివాళ్ళు కూడా వచ్చేస్తున్నారర్రా!! చచ్చిపోయింది. తగలబెడతారు కదూ?—అబ్బే—వద్దు, వద్దు. అది మళ్ళీ పెళ్ళి చేసుకుంటుంది” అంటూ ఏడుస్తూ నవ్వడం ప్రారంభించాడు.

ఆ నవ్వు, నవ్వు ఆయనలో అట్లాగే వుండిపోయింది. ఒకటి రెండు వారాలు పోయింతర్వాత కూతురు పోయిందన్న తెలివిలోంచి బయట పడ్డ తర్వాత, ఇట్లా భార్య పోయిన సంగతి చెప్తే ఆయన పెద్దగా నవ్వేస్తూ,

“ఓరి—పిచ్చివాళ్ళలారా—అది పోవడ మేమిటర్రా! బ్రతికే వుంటేను” అంటూ తన మంచం ప్రక్కనే మరో మంచం వేయించి, ఆ మంచంమీద తెల్లటి దుప్పటి పర్చి, దుప్పటి మీద తను తెప్పించిన మల్లెపూలు చల్లి, “లక్ష్మి! నీకు నిద్రపట్టడంలేదు కదూ?—పాట పాడనా, ఊహూ, నేను కాదు, నువ్వే పాడు—పోనీలే, నువ్వెందుకు గాని, నేనే నీకు భారతం, భాగవతం, రామాయణం చదివి విన్పిస్తాను. ఏం?” అంటూ ఆ అర్థరాత్రి పూట భారతం ముందేసుకుని, అందులో పద్యాలు చదువుతూ కూచునేవాడు ఈ కార్యక్రమానికి ఏరోజు కూడా భిన్నం వుండేది కాదు. శివశాస్త్రికి ఈ వ్యవహారమంతా చచ్చిన చావుగా వుండేది అటు కొడుగ్గా తన ధర్మం, ఇటు తన గౌరవం పోతోందే అన్న బాధ. తనలో తను ఆ అగ్నిని దాచుకోలేక బాధపడేవాడు. ఎప్పటికప్పుడు “ఈ పరిస్థితిలోంచి, నాకేదన్నా విముక్తి వుండంటావా?” అని అడిగేవాడు.

నేనేం చెప్పను?

కర్మ చేతిలో నేనొక కీలు బొమ్మను. చీకట్లో దారి తెలీక తారట్లాడే వాడిని.

"చీకటి తర్వాత తప్పకుండా వెలుగు వస్తుంది బ్రదర్. బాధ పడకు. ఇంతకూ మీ నాన్నగారికి జబ్బేమి టంటావ్?"

"నీ అంతట నువ్వే చూద్దువు గాని, నే చెప్పడం దేనికి!" అన్న భావన మాత్రం అతని కళ్ళల్లో ద్యోతక మైంది.

ఇద్దరం కలిసి ఎక్కడో అశోకనగర్ అవతల వున్న అమీనాపేటలోని అతని ఇంటికి వెళ్ళేసరికి బాగా చీకటి పడింది. వూరంతా ఎలక్ట్రిక్ దీపాలున్నా, అతని ఇంటి ఛాయలకు మాత్రం ఇంకా మునిసిపాలిటీవారి దీపకాంతి ప్రసరించడం లేదు శివశాస్త్రి ఇంట్లో ఇంకా లాంతర్లే వాడుతున్నారు. మేం వెళ్లేసరికి శివశాస్త్రి వాళ నాన్న, వాకిట్లో అరుగుమీద చుట్టూతా నాలుగు లాంతర్లు పెట్టుకు కూచున్నాడు. వెళ్ళి నమస్కారంపెట్టి "ఇదేమిటండీ?— నాలుగు లాంతర్లెందుకూ?" అని అడిగాను. ఆయన నవ్వాడు—మనిషిలాగా—తెలివిగలవాడిగా—నన్ను అవ హేళన చేస్తున్నట్లుగా.

"నాలుగెందుకంటారా? ఒకటికి నాలుగుండటం మంచిది కాదుటండీ? ఒకటి ఆరిపోతే రెండోది, రెండోది ఆరిపోతే మూడోది..."

ఆయన ధోరణిని ఆపుతూ, "అవునవును. మంచిదే" అన్నాను.

ఆయన వున్నట్టుండి లోపలికి పరుగెత్తుకు వెళ్ళాడు. ఇంట్లో వున్న శివశాస్త్రి భార్యమీద కేకలు వేయడం ప్రారంభించాడు.

"ఒక్కో గదిలో నాలుగేసి లాంతర్లు వుంచమని చిలక్కి చెప్పినట్లు చెప్పితే వినవేం?—వెలుగెందుకు వుండాలని?—చీకట్లో పైనుంచి పాములు రాల్తాయి. గదిలో మూల మూల పాములున్నాయి. పై కప్పులో పాములున్నాయి; భూమి క్రింద పాములున్నాయి, మనుషుల మనస్సుల్లో పాములున్నాయి. గ్రహించవేం ఎంతచెప్పినా. కాలు మెదిపితే పాము, కన్ను కదిపితే పాము, అడుగువేస్తే పాము, నుంచుంటే పాము, కూచుంటే పాము. ఎట్లా చచ్చేదీ ఇంట్లో?"

ఆ ఇల్లాలు అతి మెల్లగా ఆయనకేదో సమాధానం చెప్పింది. ఆయన దాంతో ధాటి కొంచెం తగ్గించి మళ్లీ వరండాలోకి వచ్చాడు. ఆయన అరుపులు మూలాన వెలిగించిన దీపాల్తో ఇల్లంతా పట్ట పగల్లా అయిపోయింది. మూల మూల వెతికి, చీకటి వున్నచోటల్లా క్రొవ్వొత్తి దీపాన్నో బుడ్డీ దీపాన్నో పెట్టించాడు. ఇంట్లో వత్తులయిపోతే, అప్పటి కప్పుడు మంకుపట్టు పట్టి, మరీ బజార్నించి తెప్పించాడు, మరిన్ని క్రొవ్వొత్తులు!

ఆయన ధోరణికి ఆయనను వదిలి, నేను బయటకు వస్తుంటే, శివశాస్త్రి నా రెండుచేతులూ పట్టుకుని, "నా

కేదో భయంగా వుంది, వదిలిపెట్టి వెళ్ళకురా" అని బ్రతిమ లాడాడు

"భయపడకురా! కూతురు పోయిందీ, భార్యా పోయిందీ ఆయన మనసుని చీకటి మయం చేశాయి. ఎంత వీలయితే అంత చీకటికి దూరంగా పోదామని ఆయన ప్రయత్నం చేస్తున్నాడు అంతే. మరేం భయపడకు. ఆయనలో భయానికీ, భావనకూ, సఖ్యత కుదరలేదు" అని చెప్పిబయటకు వచ్చేశాను.

మర్నాడు ప్రొద్దున్నే శివశాస్త్రి ఇంటిదగ్గర్నుంచి కబురు వచ్చింది. వెళ్ళి చూద్దును గదా, శివశాస్త్రి నాన్నగారు చచ్చిపడి వున్నారు, మనిషి అంతా ఒకానొక వికృతస్థితిలో. నాకేమీ అర్థంకాక శివశాస్త్రి వేపు చూశాను. "ఆయన పాము కరచి చనిపోయారు" అన్నాడు నేను ఉలిక్కిపడ్డాను.

అంటే?

నన్ను మాట్లాడ నివ్వలేదు శాస్త్రి. "రాత్రి ఉన్నట్టుండి పెద్ద పెట్టున గాలిదుమారానికి దీపాలన్నీ ఆరిపోయాయి. కటిక చీకటి. కన్ను పొడుచుకున్నా కన్పించని గాఢాంధకారం నా భార్య దీపం వెల్గించటానికని వంటింట్లోకి వెళ్ళింది. నాన్న భయం, భయం, పాములు పాములు అంటూ వీధిలోకి పరుగెత్తాడు. నేను దీపంతో వెళ్ళి చూద్దును గదా, ఆయన నురగలు కక్కుతూ గుమ్మందగ్గర కుప్పలా పడి ఉన్నారు."

నేను మాట్లాడలేదు. నా మట్టుకు నాకు అనిపిస్తు

న్నది, శివశాస్త్రి నాన్నలో చీకటి భయమూ, మరణ భయమూ కలిసిపోయి, చివరకు, ఈ రీతిగా మార్పు పొందాయి మరి అతన్ని అనుక్షణం ఆశ్రయించి బ్రతుకు తున్న శివశాస్త్రి ఏమవుతాడూ?

నా కండ్లలోని ప్రశ్నను గమనించి నట్లున్నాడు, "ఇప్పుడు నేను విముక్తుణ్ణి బానిసను" అన్నాడు. ఆ మాటకు నాకు వ్యాఖ్యానం కావాలి అదే అడిగాను

"అవున్రా! ఇదివరకు బ్రతుకు చీకటిలో ఏముందో తెలీక భయపడ్డాను ఇప్పుడు ఏముందో తెలిసి భయపడు తున్నాను. ఒక భయం నుంచి విముక్తుణ్ణి, మరొక భయా నికి బానిసను."

నేను మాట్లాడలేదు. శివశాస్త్రికి జీవితం కొన్ని పాఠాలు నేర్పింది. చీకటి తర్వాత వచ్చే వెలుగును ఇంకా అతడు చూడక పోయినా, చీకటి చీలికల్లో వున్న కాంతే అతనికి ధైర్యాన్నిస్తుంది అది చాలు నాకు. అందుచేత నే నిహ అక్కడ వుండవలసిన అవుసరం లేక, ఇంటి దగ్గర పిల్లలు ఎదురు చూస్తుంటారని చెప్పి, ఇవతలకు వచ్చేశాను.